క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



పెనుగంచిప్రోలు: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎంఎస్కె అర్జున్ అన్నారు. ఆదివారం గ్రామంలోని పలు ప్రాంతాల్లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలియని వ్యక్తులు చేసే ఫోన్‌కాల్స్‌పై ప్రత్యేకంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల :ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని తహసీల్దార్ పి.జాహ్నవి ఆదివారం తెలిపారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోసం ఈ వేదికలో ప్రజలు అర్జీలు దాఖలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను త్వరతిగతిన ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు.

వేదాద్రిలో ప్రత్యేక పూజలు



వేదాద్రి(జగ్గయ్యపేట): కార్తిక మాసం సందర్భంగా గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. శేష వాహనంపై స్వామి వారి ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వేదాందం శేషాచార్యులు, కృష్ణమోహనరాచార్యులు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

మంగొల్లు(వత్సవాయి): ఈ నెల 26 న నందిగామ ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు మండల కార్యదర్శి బి. రాము మాట్లాడుతూ పంటలకు మద్దతు ధర కల్పించాలని, ప్రకృతి వైపరీత్యాలు, వైరస్‌ల కారణంగా పంటలు నష్టపోతున్న రైతులకు పంటల వాతావరణం బీమాను అమలుచేయాలని, అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమబోర్డు పటిష్ట పరిచాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ధర్నా ఉంటుందన్నారు. ధర్నాలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కే పటేల్, పుల్లయ్య, అప్పారావు, మున్నా, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా లక్ష్మీ కుబేర వ్రతం



నందిగామ టౌన్:మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న అలివేలు మంగా పద్మావతి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తిక మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి లక్ష్మీ కుబేర వ్రత పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయ అర్చక స్వాములు పంచాంగం పవన్‌కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో వైఖానస సాంప్రదాయ పద్ధతిలో 300 మంది దంపతులు పీటలపై కూర్చుని లక్ష్మీ కుబేర ఉత్సవమూర్తులకు పూజలు, వ్రతాలు కనుల పండువగా జరిపించారు. అనంతరం ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సత్ప్రవర్తనతో నడుచుకోవాలి

నందిగామ టౌన్:నేర చరిత్ర కలిగిన వారు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సీఐ వైవీఎల్ నాయుడు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్‌లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్‌లు అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొంటే సహించేది లేదన్నారు. అంతే కాకుండా వారిపై నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిని గుర్తించి రౌడీషీట్ తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఎటువంటి నేరాలకు పాల్పడమని రౌడీషీటర్‌లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అభిమన్యు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా గంజాయి విక్రయాలు!

- కంచికచర్లలో మత్తు పదార్థాల అమ్మకాలు
- గంజాయి మత్తులో జోగుతున్న యువకులు
- పట్టించుకోని అధికారులు



వీరులపాడు: గంజాయి విక్రయాలకు కంచికచర్ల పట్టణంతో పాటు వీరులపాడు మండలంలోని పొన్నవరం గ్రామం అడ్డాగా మారింది. కంచికచర్ల పట్టణ పరిధిలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలు ఇక్కడ ఉండటంతో పాటు కొందరు గంజాయి విక్రయదారులు ఈ ప్రాంతాల్లో నివాసం ఉండే ఆటో డ్రైవర్లు, కొంత మంది అమాయక విద్యార్థులకు డబ్బు ఆశ చూపి గంజాయిని పొట్లాల రూపంలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కంచికచర్ల పట్టణంలో ఇంజినీరింగ్ విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడే అద్దెకు నివాస గృహాలు తీసుకుని ఉంటున్నారు. గంజాయి విక్రయదారులు 20 నుంచి 50 గ్రాముల చొప్పున పొట్లాలను కట్టి రూ.500 నుంచి రూ. 1000లకు అమ్ముకుంటున్నారు. రోజూ వందలాది మంది విద్యార్థులు కంచికచర్లలో గంజాయి కొనుగోలు చేస్తున్నారు. గంజాయి దమ్ము కొట్టే వారు ఒక్కో బ్యాచ్ 15 నుంచి 20 మంది విద్యార్థులుంటున్నారు. ఆటో డ్రైవర్లు, విద్యార్థులు పలువురు కూడా గంజాయి మత్తుకు అలవాటు పడి తమ జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు.

విద్యార్థులే టార్గెట్..

గంజాయి విక్రేతలు విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుంటున్నారు. చుట్టుపక్కల కళాశాలల్లో ఇద్దరు, ముగ్గురు యువకులను ఆకర్షించి వారితో గంజాయి దమ్ము కొట్టడాన్ని నేర్పుతున్నారు. ఇందు కోసం గంజాయి విక్రేతలు ఆ యువకులకు భారీ మొత్తంలో నగదు కూడా ముట్ట చెబుతున్నారు. గంజాయి విక్రయించే వారు యువతీ, యువకులకు ఎక్కడకు వెళ్లి దమ్ము కొట్టొచ్చు ఎక్కడ ప్రశాంతంగా ఉంటుందని స్థలాలను కూడా చూపిస్తున్నారు. ఇటీవల కాలంలోనే వీరులపాడు మండలం పొన్నవరం గ్రామానికి చెందిన వ్యక్తి తెలంగాణ రాష్ట్రంలో గంజాయి తరలిస్తూ పోలీసులకు చిక్కాడు. అతని అనుచరులు మండలంలో పలు గ్రామాల్లో గంజాయి విక్రయాలు జరుపుతున్నారని పలువురు గ్రామస్తులు బాహటంగానే పేర్కొంటున్నారు.

గంజాయి తాగేందుకు అడ్డాలు ఇవీ....

కంచికచర్ల పట్టణంలో వేములపల్లి వెళ్లే రహదారి, బైపాస్ రోడ్డు, గ్రామ శివారులో ఉండే ఖాళీ ప్రదేశాలు, తదితర ప్రాంతాలను గంజాయి తాగేందుకు అడ్డాగా మార్చుకున్నారు. ఎవరైన విద్యార్థులు గంజాయి తాగుతూ పట్టుబడితే పోలీసులు తమదైన శైలిలో మందలిస్తున్నారు. విద్యార్థులు భవిష్యత్తు నాశనమవుతుందని పోలీసులు కఠినంగా వ్యవహరించకపోవటంతో గంజాయి విక్రయదారులు మరింత రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గంజాయి విక్రయదారుల ఆటకట్టించి విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలని పలువురు కోరుతున్నారు.

తోటచర్లలో కల్వర్టులు నిర్మించాలి



రహదారుల పరిశీలనలో తన్నీరు, నాయకులు

తోటచర్ల(పెనుగంచిప్రోలు):గ్రామంలోని జగనన్న మోడల్ కాలనీలో నిర్మిస్తున్న అప్రోచ్ రోడ్లలో అవసరమైన చోట కల్వర్టులు నిర్మించాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన గ్రామంలో పర్యటించి మోడల్ కాలనీలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో కల్వర్టులు నిర్మించక పోతే రోడ్లు పాడవుతాయన్నారు. అలాగే జాతీయ రహదారి నుంచి కాలనీకి వచ్చే సీసీ రోడ్డును 6 మీటర్ల మేర వేయాలన్నారు. ప్రస్తుతం వేస్తున్న 3 మీటర్ల రోడ్డు వలన వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. తక్షణం రహదారి వెడల్పు పెంచాలని డిమాండ్ చేశారు. దీనిపై పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడటంతో పాటు కల్వర్టులు నిర్మాణానికి మండల పరిషత్ నుంచి నిధులు కేటాయించాలని ఎంపీపీ మార్కపూడి గాంధీని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కునగుంట్ల రాములమ్మ, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, గ్రామ పార్టీ నాయకులు కునగుంట్ల కోటేశ్వరరావు, శ్రీకనకదుర్గమ్మ ఆలయ డైరెక్టర్ నంబూరి రవి, నాయకులు మన్నె అప్పారావు, కొంద్రు సురేష్, పులగం నాగార్జున, సురేష్, స్వామి, భిక్షాలు, తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుదలపై ప్రత్యేక దృష్టి



గండేపల్లిలో డ్రైయినేజీలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రవికుమార్

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లిలో శానిటేషన్ పనులు చేపట్టామని సర్పంచ్ బొక్కా రవికుమార్ ఆదివారం తెలిపారు. గ్రామంలో డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించటంతో పాటు మురుగునీరు పారుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డ్రెయినేజీల్లో బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నామని గ్రామంలో ప్రజలు రోగాలబారిన పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిత్యం ప్రజలకు రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాన పైపులైన్లు మరమ్మతులు చేయించి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. గ్రామంలో మరమ్మతులకు గురయిన బోరు పంపులను బాగుచేయిస్తున్నామని పేర్కొన్నారు. తాగునీటి సమస్య ఉన్నట్లయితే ప్రజలు తమకు తెలియజేస్తే తప్పనిసరిగా తాగునీరు ఆ వీధికి సరఫరా అయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో అన్న ప్రసాద వితరణ



రెండో అంతస్తులో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో భక్తులకు నిత్యాన్నదానం జరుగుతుంది. కార్తీక మాసం, ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ప్రతి రోజు ఉదయం 10–30 గంటల నుంచి మధ్యాహ్నం 3–30 గంటల వరకు, సాయంత్రం 7–30 గంటల నుంచి 8–30 గంటల వరకు అమ్మవారి సన్నిధిలో నిత్యాన్నదానం చేస్తారు. శుక్ర, ఆదివారాల్లో రోజుకు 8 వేలు, సోమవారం నుంచి గురువారం 6 వేల మందికి అన్న ప్రసాద వితరణ ఉంటుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం రెండో అంతస్తులో భక్తులు కూర్చుని తినే విధానంలో, మొదటి అంతస్తులో బఫే పద్ధతిలో అన్న ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నారు. ఇక సాయంత్రం 7–30 గంటల నుంచి రాజగోపురం ఎదుట వెయ్యి మంది, శుక్రవారం , ఆదివారం 1500 మందికి అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. శుక్రవారం, శనివారం, ఆదివారాలలో రద్దీ అధికంగా ఉండటంతో అన్నప్రసాద వితరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులందరూ అన్నప్రసాదం స్వీకరించేందుకు, ఎక్కువ సమయం క్యూలైన్‌లో వేచి ఉండకుండా ఉండేందుకు బఫే పద్ధతిని ప్రవేశ పెట్టామని తెలిపారు. ఇక కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారాలతో పాటు విశేష పర్వదినాల్లో రోజుకు 2500 మందికి మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సాయంత్రం సంధ్యా సమయంలో అన్న ప్రసాద వితరణ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం తేవాలంటూ భార్యను శారీరకంగా , మానసికంగా వేధిస్తోన్న భర్తపై భవానిపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... భవానీపురం ఎంబీజీకి చెందిన చిక్కాల సాయి శరణ్య, చిక్కాల రాజేష్‌లకు 2015లో క్రైస్తవ సంప్రదాయంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో సాయి శరణ్య తల్లిదండ్రులు కట్నంగా రూ. 3లక్షలు నగదు, బంగారు నగలు రాజేష్‌కు ఇచ్చారు. కొంత కాలం వీరి సంసారం సజావుగానే సాగింది. వీరికి బాబు పుట్టాడు. ఆ తర్వాత శరణ్య భర్త రాజేష్ వ్యసనాలకు బానిసయ్యాడు. అదనంగా రూ. 2 లక్షలు కట్నం తేవాలంటూ వేధించసాగాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యను వేధిస్తున్నాడు. కన్న కొడుకును, భార్యను చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడు. అర్ధ రాత్రి సమయంలో ఇంటికి వచ్చి భయాందోళనకు గురిచేస్తున్నాడు. సెప్టెంబర్ నెలలో మద్యం సేవించి ఇంటికి వచ్చి డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానంటూ బెదిరించాడు. రౌడీలను తీసుకువచ్చి నానారకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీనిపై చిక్కాల సాయి శరణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్దులమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

కంచికచర్ల: మండలంలోని గొట్టుముక్కల అడవిలో కొలువై ఉన్న మద్దులమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ఇలవేల్పు అయిన మద్దులమ్మ తల్లి కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారుగా భక్తుల నమ్మకం, ట్రాక్టర్లు, ఆటోలతో మద్దులమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని పాయసం, పొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి ఆలయం సమీపంలో లోయలోకి ప్రవహిస్తున్న జలపాతం భక్తులను అలరింపచేస్తుంది. గత సెప్టెంబర్ నెలలో కురిసిన భారీ వర్షాలకు అమ్మవారి ఆలయానికి వెళ్లే రోడ్డు పెద్ద పెద్ద గండ్లు పడి పూర్తిగా దెబ్బతింది. రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవటంతో భక్తులు ఆలయానికి చేరటానికి అనేక అవస్థలు పడుతున్నారు. పాలకులు ఇప్పటికైనా స్పందించి మద్దులమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే రోడ్డును బాగు చేయాలని పలు గ్రామాల భక్తులు కోరుతున్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు..

బొడవాడ(వీరులపాడు):ఆటోను వేగంగా వచ్చిన కారు వెనుకగా ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. గొల్లపూడి గ్రామానికి చెందిన నరసింహారావు ఆదివారం మండలంలోని పొన్నవరం గ్రామంలోని తమ బంధువులను నందలూరు గ్రామం వెళ్లేందుకు ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో బొడవాడ గ్రామ శివారులో వేగంగా వస్తున్న కారు వెనుకగా ఆటోను ఢీకొనటంతో ఆటో అదుపు తప్పి రహదారి పక్కనున్న కంథకంలోకి వెళ్లి పల్టీ కొట్టింది. దీంతో ఆటోలోని డ్రైవర్ నరసింహారావుకు తీవ్ర గాయాలు కాగా అందులో ఉన్న మరో ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తులను గ్రామస్తులు హుటాహుటిన కంచికచర్లలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వర్ణశోభితం.. గరళాకంఠం..



జగ్గయ్యపేట:కార్తిక మాసం సందర్భంగా పట్టణంలోని పాలేటి ఒడ్డునున్న రుద్రభూమి శివాలయంలో శనివారం రాత్రి రంగురంగుల ముగ్గులతో ఏర్పాటు చేసిన శివాలింగాకృతి ఆకట్టుకుంది. పట్టణంలోని విశ్వబ్రాహ్మణ బజారుకు చెందిన అలాసపురి యామిని శివలింగం, త్రిశూలం, తదితర రూపాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అయ్యప్ప, శివ స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యుడు రాదా మనోహర దాస్, అయ్యప్ప, శివ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

దుర్గమ్మ చెంత భక్తి సంగీతం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం విజయవాడకు చెందిన శృతిలయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో భక్తి సంగీతాన్ని ఆలపించారు. డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య నేతృత్వంలో పలు కీర్తనలు చక్కటి గాత్రంతో ఆలపించారు. కోదండ రామయ్యకు పాలపర్తి ఆంజనేయశాస్త్రి వయోలిన్‌పై, చిట్టిబాబు తబలాపై చక్కటి సహకారాన్ని అందించారు. అమ్మవారిని దర్శించుకుని మహా మండపం వద్దకు చేరుకున్న భక్తులు కళావేదికపై జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాన్ని ఎంతో ఆసక్తితో వీక్షించారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

ఎస్టీయూ నేతల డిమాండ్



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులన్నీ చెల్లించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జగ్గయ్యపేట మండల శాఖ మధ్యంతర కౌన్సిల్ కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక టీచర్స్ కోపరేటివ్ సొసైటీ భవన్‌లో సంఘం మండల అధ్యక్షుడు కె.రాజేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎం.శ్రీహరి, రాష్ట్ర కౌన్సిలర్ టీవీఎల్ నరసింహారావు, జిల్లా సహాధ్యక్షుడు పీడీవీ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయం వలన రవాణా సౌకర్యం సరిగా లేకుండా దూర ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థులు మానసికంగా ఇబ్బంది పడతారని తెలిపారు. వారి అభ్యసనా స్థాయి గుర్తించకుండా హఠాత్తుగా పనివేళల పెంపు వల్ల ఒత్తిడికి గురవుతారని చెప్పారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్, డీఏ బకాయిలు, ఇతర పెండింగ్ బిల్స్ తక్షణం చెల్లించాలని, 12 వ పీఆర్సీ, మధ్యంతర భృతి తక్షణం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి వత్సవాయి మండల అధ్యక్షుడు పి.ఆనంద్ పర్యవేక్షణ అధికారిగా, జిల్లా సహాధ్యక్షుడు పీడీవీ ప్రసాదరావు పరిశీలకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.రామాంజనేయులు, బి.శ్రీనివాసరావు, జి.రవికుమార్, పేట మండల ప్రధాన కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, వత్సవాయి మండల ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వనసమారాధనలు ఐక్యతకు ప్రతీకలు

ఎమ్మెల్యే తాతయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, చిత్రంలో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు

జగ్గయ్యపేట అర్బన్:వన సమారాధనలు ఐక్యతకు, సామరస్యానికి ప్రతీకలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. కార్తిక వనసమారాధనలో భాగంగా ఆదివారం పట్టణ సమీపంలోని ఇండేన్ గ్యాస్ కంపెనీ వద్ద ఉన్న భారతి టౌన్‌షిప్‌లోని మామిడితోటలో ఆర్యవైశ్య సంఘం వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి కుటుంబ సభ్యులతో వేలాదిగా తరలివచ్చిన సేవాసమితి సభ్యులు రోజంతా క్రీడలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందోత్సవాలతో గడిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ వనసమారాధనలు వంటివి సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని చెప్పారు. ఆర్యవైశ్య సంఘాలు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. ఇటీవలే వివిధ రంగాల్లో అవార్డులు అందుకున్న బుస్సా సురేష్, గార్లపాటి చంద్రశేఖర్, తూములూరి ప్రసాద్‌లను ఎమ్మెల్యే తాతయ్య సన్మానించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని ఎమ్మెల్యే తాతయ్య అభినందించి వారికి నగదు బహుమతులను అందజేశారు.

ఘనంగా ఆర్యవైశ్య సంఘం వనసమారాధన



కీసర మామిడితోటలో వనసమారాధనలో సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తున్న దంపతులు



బెలూన్లు పగులకొట్టే ఆటలో పాల్గొన్న భార్యాభర్తలు



కార్తీక వన సమారాధనలో సందడి చేస్తున్న మహిళలు

కంచికచర్ల :కార్తికమాసం సందర్భంగా వాసవి యువసేన, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని కీసర మామిడితోటలో ఉల్లాసంగా ఉత్సాహంగా కేరింతలు కొడుతూ వనసమారాధనలో పాల్గొన్నారు. ముందుగా మామిడితోటలో ఉన్న ఉసిరి చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 12 మంది వేద పండితులతో మహన్యాస ఏకాదశ రుద్రాభిషేకం, శివునికి అభిషేకాలు చేశారు. అదేవిధంగా పుణ్య దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతం చేశారు. చిన్నారులు సైతం కార్యక్రమంలో పాల్గొని డ్యాన్స్ చేశారు. వనసమారాధనకు వచ్చిన వారితో డ్రా తీయగా మొదటి బహుమతి, అర గ్రాము బంగారం, ద్వితీయ బహుమతి అర గ్రాము బంగారం, తృతీయ బహుమతి 10 గ్రాముల వెండిని సంఘ నాయకులు అందజేశారు.

ఘనంగా కార్తిక సమారాధన

నందిగామ టౌన్:మండలంలోని లింగాలపాడు గ్రామానికి చెందిన కాపు, బీసీ సామాజిక వర్గాల కార్తిక వన సమారాధన ఆదివారం గ్రామ సమీపంలోని మామిడి తోటల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కులాల వారీగా వన సమారాధనలు జరుపుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో సామూహిక వన సమారాదన నిర్వహించుకోవటం సంతోషంగా ఉందన్నారు. కులమతాల తేడా లేకుండా చిన్నపెద్దా తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ వన సమారాధనలో ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పారుపల్లి హరిబాబు, సూరా వెంకట్రావ్, సూరా సురేష్, మందడపు సత్యనారాయణ, వెలగా సత్యనారాయణ, మణిమాల నాగరాజు, బండి గోపి తదితరులు పాల్గొన్నారు.

వనసమారాధనలు ఐక్యతను పెంపొందిస్తాయి

మాజీ మంత్రి నెట్టెం శ్రీరఘురాం



వేదికపై ఐక్యతను చాటుతున్న నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: వన సమారాధనలు ఐక్యతను పెంపొందిస్తాయని మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం శ్రీరఘురాం అన్నారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం వత్సవాయి మండల, దేచుపాలెం రోడ్‌లోని హనుమంతు రత్నకుమారి చంద్రశేఖర్ మామిడి తోటలో కాకతీయ కమ్మ సేవాసమితి వారు ఏర్పాటుచేసిన వనసమారాధనలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ (చిన్నా), పారిశ్రామికవేత్త వెనిగండ్ల సురేష్ తదితర నాయకులతో శ్రీరఘురాం పాల్గొని మాట్లాడారు. పురాతన కాలం నుంచి పెద్దలు ఆచరిస్తూ వచ్చిన ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. వైఎస్సార్ సీపీ నియోజక సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ వనసమారాధనలు తరిగిపోతున్న మానవ సంబంధాలను మరింతగా ఇనుమడింపజేస్తాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి చిన్నా మాట్లాడుతూ ఈ మాసంలో ప్రతిఒక్కరి కుటుంబాల్లో శుభం జరగాలని ఆకాంక్షించారు. ఇలాంటి సామూహిక వనసమారాధనలు సంఘీభావం పెంచుతుందన్నారు. కార్యక్రమంలో కాకతీయ కమ్మ సేవా సమితి అధ్యక్షుడు ఇంటూరి రంగనాయకులు, కార్యదర్శి సూరపనేని సుబ్బారావు, సంఘ పూర్వ అధ్యక్షుడు కల్యాణపు కృష్ణారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గింజుపల్లి రమేష్, డాక్టర్ బొజ్జ సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆటపాటలతో చిన్నారులు



ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు



సహపంక్తి భోజనాలు

వనసమారాధనలతో కళకళ...

పవిత్ర కార్తిక మాసంలో ఆదివారం మునేరు అవతల మామిడి తోటలు వనసమారాధనలతో కళకళలాడాయి. ఆంధ్రా నుంచే కాకుండా తెలంగాణకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు ఉసిరి చెట్లుకు పూజలు చేశారు. శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. మండలంలోని ఆర్యవైశ్యులు సహపంక్తి భోజనాలు చేశారు. వయస్సుతో సంబంధం లేకుండా అందరూ ఆటపాటలతో హాయిగా గడిపారు.

పెనుగంచిప్రోలు